ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 249 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
గురువారం 10 ఏప్రిల్ 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉంది:సీఎం రేవంత్ రెడ్డి

పోలీసులకు యంగ్ ఇండియా స్కూల్ అత్యంత ముఖ్యమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 10, (రిపబ్లిక్ న్యూస్): పోలీసులకు యంగ్ ఇండియా స్కూల్ అత్యంత ముఖ్యమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో ఆయన యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌ను ప్రారంభించి మాట్లాడారు. పోలీసు శాఖపై తనకు స్పష్టమైన ఆలోచన ఉందన్నారు. దేశంలో ఉన్న గొప్ప వర్సిటీలు నెహ్రూ స్థాపించినవేనని చెప్పారు.

"16 నెలలైనా బ్రాండ్ ఎందుకు సృష్టించుకోలేదని నన్ను కొందరు అడుగుతున్నారు. యంగ్ ఇండియాలో చదువు, ఉపాధే నా బ్రాండ్. కొందరు ఉద్యమ నేతలం, తెలంగాణ ప్రదాతలమని అనుకుంటున్నారు. దేశానికే దార్శనికుడు పీవీ నరసింహారావు. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని స్థాపించాం. దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉంది. కేజీ టు పీజీ వరకు నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రావు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్కు రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్‌ను సమకూర్చుకోవాలి. నిధుల విషయంలో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి" అని రేవంత్ రెడ్డి తెలిపారు.

ఆయనది డేరింగ్ పర్సనాలిటీ..

నేనూ అలానే ఉంటా:దిల్లీ సీఎం రేఖాగుప్తా

కేంద్రమంత్రి అమిత్ షా మాదిరి తాను ఉండాలని కోరుకుంటున్నట్లు దిల్లీ సీఎం రేఖా గుప్తా తెలిపారు.

దిల్లీ, ఏప్రిల్ 10, (రిపబ్లిక్ న్యూస్): దేశ రాజధాని దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలను కొనియాడారు. మోదీని ఆమె సాధువు మనస్తత్వంతో పోల్చారు. అమిత్ షా మాదిరిగా తాను ఉండాలని కోరుకుంటున్నట్లు ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం వెల్లడించారు.

"ప్రధాని మోదీ సాధువు మనస్తత్వం కలవారుగా భావిస్తున్నా. సాధారణంగా కొందరు భగవంతుడి సేవకు తమ జీవితాన్ని అంకితం చేస్తారు. కానీ, దేశానికి సేవ చేసేందుకు ప్రధాని తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన బాటలో నడుస్తున్న వారు మా పార్టీలో చాలా మంది ఉన్నారు. వారిలో కేంద్రమంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ కూడా ఉన్నారు" అని పేర్కొన్నారు. "కేంద్ర హోంమంత్రి అమిత్ షా డేరింగ్ పర్సనాలిటీ. ఎంత క్లిష్ట పరిస్థితులనైనా ఆయన ఎదుర్కోగలరు. ఆ సమయంలో కఠిన నిర్ణయాలు తీసుకుని చివరి వరకు వాటిని పాటిస్తారు. ఆ సామర్థ్యం ఆయనకుంది. ఆయన మాదిరి నేను ఉండాలని కోరుకుంటున్నాను. దేశం పట్ల భాజపా ఎంతో విధేయతతో ఉంటోంది' అని కొనియాడారు. కాగా.. ఇటీవల జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 27 ఏళ్ల తర్వాత భాజపా అధికారం చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. మహిళా నాయకత్వానికి పెద్ద పీట వేసిన కాషాయ పార్టీ.. రేఖా గుప్తాకు సీఎం పదవి కట్టపెట్టింది.

ఏఐ రాకతో సాంకేతిక యుద్ధం జరుగుతోంది:రాజ్‌నాథ్ సింగ్

ప్రస్తుతం సంప్రదాయ యుద్ధాలు చేసుకునే కాలం పోయిందని.. ఏఐ రాకతో సాంకేతిక యుద్ధం జరుగుతోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

చెన్నై, ఏప్రిల్ 10, (రిపబ్లిక్ న్యూస్): రాజకీయ, సైనిక లక్ష్యాలను సాధించుకునేందుకు కొందరు సైబర్ దాడులను సాధనాలుగా వినియోగిస్తున్నారని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం కూడా ఇందులో ఓ భాగమని వ్యాఖ్యానించారు. తమిళనాడులోని డిఫెన్స్ సర్వీస్ స్టాఫ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంఘర్షణలు, పరిస్థితులు సంప్రదాయ యుద్ధాలకు భిన్నంగా మారుతున్నాయని రాజ్నాథ్ సింగ్ అన్నారు.

"నానాటికీ అభివృద్ధి చెందుతున్న సాంకేతికత మానవ ప్రమేయం లేని వ్యవస్థను సృష్టిస్తోంది. చాలా విషయాలను ఏఐ అంచనా వేయడం చూస్తున్నాం. ఇప్పుడు సంప్రదాయ యుద్ధాలు (భూమి, జల, వాయు మార్గాల్లో చేసే యుద్ధం) చేసుకునే కాలం పోయింది. ఏఐ రాకతో సాంకేతిక యుద్ధం జరుగుతోంది" అని ప్రసంగించారు. "ప్రస్తుతం మనమంతా 'గ్రే జోన్', హైబ్రిడ్ యుద్ధ శకంలో ఉన్నాము. రాజకీయ, సైనిక లక్ష్యాలను సాధించుకోవడానికి కొందరు సైబర్ దాడులను వినియోగిస్తున్నారు. ఆర్థిక యుద్ధం అనేది ఒక్క తూటా కూడా పేల్చకుండా రాజకీయ, సైనిక లక్ష్యాలను అమలుచేయగలవు. అందుకే వీటిని సాధనాలుగా మలుచుకుంటున్నారు. సైబర్, అంతరిక్షం, సమాచార యుద్ధాలు కూడా సంప్రదాయ యుద్ధంలా ఎంతో శక్తిమంతమైనవి. వీటితో పోరాడేందుకు బహుళ- డొమైన్ వాతావరణంలో సాయుధ దళాలు కలసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది" అని నొక్కి చెప్పారు. "మన పొరుగునున్న ప్రాంతాల నుంచి మనపై పరోక్ష యుద్ధం జరుగుతోంది. అక్కడినుంచి ఉగ్రవాద ముప్పుతో ఇది మరింత తీవ్రమవుతోంది. సైబర్ దాడులకు బలికాకుండా ఉండాలంటే మనమంతా కలిసి పోరాడాలి" అని అన్నారు.

నెల్లూరు జిల్లాలో భర్త, అత్తమామల పైశాచికం.. కోడలిని వివస్త్రను చేసి హత్య!

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఘోరం జరిగింది. ఓ మహిళను భర్త, అత్తమామలు, ఆడపడుచు దారుణంగా హింసించి చంపేశారు.

నెల్లూరు, ఏప్రిల్ 10, (రిపబ్లిక్ న్యూస్): శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఘోరం జరిగింది. ఓ మహిళను భర్త, అత్తమామలు, ఆడపడుచు దారుణంగా హింసించి చంపేశారు.

వివరాల్లోకి వెళితే.. కట్నం కోసం మహిళను భర్త హరికృష్ణ, అత్తమామలు నాగోరు, నర్సమ్మ, ఆడపడుచు నాగలక్ష్మి గత కొంతకాలంగా వేధిస్తున్నారు. పలుమార్లు ఆమెపై దాడి చేశారు. బాధితురాలు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేస్తానని వారిని హెచ్చరించింది. ఇలా చెప్పడంతో తాజాగా ఆమెపై మరోసారి దాడికి పాల్పడ్డారు. ఫిర్యాదు చేస్తుందని భయపడి రంగునీళ్లు తాగించి ఊపిరాడకుండా చేశారు. అనంతరం వివస్త్రను చేసి దారుణంగా కొట్టి హతమార్చారు. ఈ ఘటనపై బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

చల్లబడిన వాతావరణం.. హైదరాబాద్లోని పలు ప్రాంతాల్లో వర్షం

నగరంలో పలు చోట్ల వర్షం కురుస్తోంది. ఉదయం నుంచే వాతావరణం చల్లబడగా.. తాజాగా వర్షం మొదలైంది.

హైదరాబాద్, ఏప్రిల్ 10, (రిపబ్లిక్ న్యూస్): నగరంలో పలు చోట్ల వర్షం కురుస్తోంది. ఉదయం నుంచే వాతావరణం చల్లబడగా.. తాజాగా వర్షం మొదలైంది. మియాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. మేడ్చల్, గగిల్లాపూర్ తదితర ప్రాంతాల్లో చిరు జల్లులు పడుతున్నాయి. ఎస్ఆర్ నగర్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి.

క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు పడుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్ లో ఇవాళ తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. నగరంలో రానున్న 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని పేర్కొంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఇవాళ సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే సూచనలున్నాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీచేసినట్లు తెలిపింది. రేపు (ఏప్రిల్ 11న) కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

కంచ గచ్చిబౌలి భూములు హెచ్సీయూవే.. సీసీఎల్ఎక్కు 2012లోనే కలెక్టర్ లేఖ: హరీశ్ రావు

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని పరిశీలించేందుకు హెచ్ సీయూకు పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీ వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది.

హైదరాబాద్, ఏప్రిల్ 10, (రిపబ్లిక్ న్యూస్): కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని పరిశీలించేందుకు పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీ హెచ్సీయూను సందర్శించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు నేతృత్వంలోని బృందం కమిటీతో భేటీ అయింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో డాక్యుమెంట్లు, విజువల్స్తో కూడిన నివేదికను భారాస బృందం.. కమిటీకి అందించింది. అనంతరం తెలంగాణ భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. "వాల్టా చట్టం ప్రకారం చెట్లు కొట్టాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఇందుకోసం ఆన్లైన్లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. అటవీశాఖ అనుమతి ఇచ్చాకే చెట్లను నరకాలి. ఒక్కో చెట్టుకు రూ.400 డిపాజిట్ చేశాకే కొట్టాల్సి ఉంటుంది. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఆందోళన చేసినా అటవీ శాఖ పట్టించుకోలేదు. అటవీ శాఖ స్పందించకపోవడంతోనే చెట్లు నరికేశారు, జంతువులు చనిపోయాయి. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, మార్గదర్శకాలు, నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ.. వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. 2011లో కంచ గచ్చిబౌలి భూముల్లో జీహెచ్ఎంసీ లక్ష మొక్కలను నాటింది. ఆ భూముల్లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నాటిన మొక్కలు కూడా ఉన్నాయి. అరుదైన పక్షులు, జంతువులు, చెట్లు

కంచ గచ్చిబౌలి భూముల్లో ఉన్నాయి. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలా కాకుండా రాష్ట్ర ప్రభుత్వమే వాటిని భక్షిస్తోంది. కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి గతేడాది నవంబర్ 22న రూ.10వేల కోట్లు రుణం తెచ్చారు. రుణం ఇప్పించిన మధ్యవర్తికి రూ.170 కోట్లు లంచం ఇచ్చారు. మధ్యవర్తికి ఇచ్చిన డబ్బు విషయాన్ని సాక్షాత్తూ అసెంబ్లీలోనే చెప్పారు. ఫార్మాసిటీ కోసం 14వేల ఎకరాలు సేకరించారు కదా.. దానిని అభివృద్ధి చేయండి. అక్కడ ఎలాంటి చెట్లు, వన్యప్రాణులు లేవు. కంచ గచ్చిబౌలి భూములు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్సీయూ)కి చెందినవే. ఈ భూములు హెచ్సీయూకి చెందినవే అని సీసీఎల్ కు 2012లోనే అప్పటి కలెక్టర్ లేఖ రాశారు" అని హరీశ్రావు పేర్కొన్నారు.

వక్ఫ్ బిల్లుపై వైకాపాది దొంగాట:సీపీఐ నేత నారాయణ

వక్ఫ్ బిల్లుపై వైకాపా దొంగాట ఆడిందని సీపీఐ నేత నారాయణ విమర్శించారు.

తిరుపతి, ఏప్రిల్ 10, (రిపబ్లిక్ న్యూస్): వక్ఫ్ బిల్లుపై వైకాపా దొంగాట ఆడిందని సీపీఐ నేత నారాయణ విమర్శించారు. తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైకాపా రాజ్యసభలో ఒకలా.. లోక్సభలో మరోలా మద్దతిచ్చిందని చెప్పారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈ నెల 12న నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. పోలీసులు మనోధైర్యం దెబ్బతీసేలా జగన్ మాట్లాడకూడదన్నారు. సీఎంగా పనిచేసిన వ్యక్తి ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం తప్పు అని పేర్కొన్నారు. "ట్రేడ్ వార్ మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుంది. చింతపల్లె అటవీ ప్రాంతానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లడం, రాత్రి బస చేసిన విధానం బాగుంది. వచ్చే ఎన్నికల్లో గెలవాలనే ఉద్దేశంతోనే భాజపా భాష, డీలిమిటేషన్, వక్ఫ్ బోర్డు అంశాలను ముందుకు తీసుకుని పోతోంది. వక్ఫ్ బోర్డు ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వాలనేది ఆ పార్టీ కుట్ర" అని నారాయణ విమర్శించారు.

వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి పై కేసు

వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి పై కేసు నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు.

రామగిరి, ఏప్రిల్ 10, (రిపబ్లిక్ న్యూస్): వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి పై కేసు నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఇటీవల పాపిరెడ్డిపల్లెలో వైకాపా అధ్యక్షుడు జగన్ పర్యటన సందర్భంగా హెలికాప్టర్ వద్ద తోపులాట జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కొంతమంది వైకాపా కార్యకర్తలు రాళ్లదాడికి పాల్పడటంతో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. గాయపడిన కానిస్టేబుల్ ఫిర్యాదుతో గురువారం తోపుదుర్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జగన్ భద్రతపై పోలీసులు చేసిన సూచనలను మాజీ ఎమ్మెల్యే పాటించలేదని కానిస్టేబుల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జగన్ హెలికాప్టర్ దిగకముందే వైకాపా కార్యకర్తలు దూసుకొచ్చారన్నారు. ఆపై హెలికాప్టర్పై పిడిగుద్దులు గుద్దినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. హెలిప్యాడ్ వద్ద కార్యకర్తలను తోపుదుర్తి రెచ్చగొట్టినట్లు.. భద్రతా వైఫల్యంగా చూపేందుకు ప్రయత్నం చేసినట్లు పోలీసుల విచారణలో నిర్ధరణ అయింది.

అప్పుడు కసబ్ని కాల్చేద్దామనుకున్నా.. దావూద్, హఫీజ్ లాంటోళ్లని ఉరితీయాలి:దేవిక

దిల్లీ, ఏప్రిల్ 10, (రిపబ్లిక్ న్యూస్): ముంబయి ఉగ్రదాడి ఘటనలో కీలక సూత్రధారి తహవ్వూర్ రాణా భారత్‌కు చేరుకున్నాడు. అమెరికా నుంచి దిల్లీ విమానాశ్రయానికి అతడిని తీసుకొచ్చారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో అతడిని ఎన్ఐఏ ప్రధాన కార్యాలయానికి తరలించినట్లు సమాచారం. దీంతో ఎన్ఐఏ ప్రధాన కార్యాలయం వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. తహవ్వూర్ రాణాను భారత్‌కు తీసుకురావడంపై ముంబయి దాడుల్లో బాధితురాలు, ఉగ్రవాది అజ్మల్ కసబ్ను గుర్తించడంలో కీలక సాక్షిగా ఉన్న దేవికా రోటావన్ హర్షం వ్యక్తం చేశారు. అతడిని అమెరికా నుంచి తీసుకురావడం భారత ప్రభుత్వం సాధించిన పెద్ద విజయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఓ ప్రముఖ వార్తా సంస్థతో మాట్లాడారు. "తహవ్వూర్ రాణాను తీసుకొచ్చినందుకు భారత్, అమెరికా ప్రభుత్వాలకు ధన్యవాదాలు. రాణానుంచి అనేక కీలక వివరాలు రాబట్టొచ్చు.. పాకిస్థాన్లో ఇప్పటికీ దాగి ఉన్న ఉగ్రవాదులను పెంచి పోషించేవారి పేర్లు బయటకు రావొచ్చు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మోదీ సర్కార్ కృషిచేస్తోంది. పాకిస్థాన్లో దాగి ఉన్న ఉగ్రవాదులతో పాటు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సరే.. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చేవారిని శిక్షించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నా. అజ్మల్ కసబ్ మాదిరిగా ఉగ్రవాదులకు మరణ దండన విధించాలి. పాకిస్థాన్లో

ఉన్న దావూద్ ఇబ్రహీం, హఫీజ్ సయీద్ ఇతర కీలక సూత్రధారులను భారత్కు తీసుకొచ్చి ఉరిశిక్ష విధించాలి. ఇప్పటికీ పొరుగు దేశంలో ఉన్న ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేవారిని, కసబ్ లాంటి కిరాతకుల్ని తయారుచేసే వారిని అంతం చేయాలి. అప్పుడే ముంబయి దాడుల్లో బాధితులకు న్యాయం జరుగుతుంది" అన్నారు. ముంబయి దాడి ఘటన రోజును గుర్తు చేసుకున్న ఆమె.. కసబ్ను చూపెట్టినప్పుడు తనకెవరైనా తుపాకీ ఇస్తే కాల్చేద్దామనుకున్నానన్నారు. అప్పుడు తన వయస్సు పదేళ్లేనని చెప్పారు. 26/11 దాడిగా ప్రసిద్ధమైన ముంబయి ఉగ్రదాడి 2008 నవంబరు 26న జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడిలో 10 మంది ఉగ్రవాదులు ముంబయిలోని వివిధ ప్రాంతాల్లో విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 166 మంది అమాయకులను పొట్టనబెట్టుకోవడం యావత్ ప్రపంచాన్ని తీవ్ర విషాదానికి గురిచేసింది.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1755: హోమియోపతి వైద్యవిధానాన్ని కనిపెట్టిన క్రిస్టియన్ ఫ్రెడెరిక్ శామ్యూల్ హానిమాన్ జననం (మ.1843).
- 1813 : గణిత శాస్త్రవేత్త, ఖగోళ శాస్త్రజ్ఞుడు జోసెఫ్ లూయిస్ లెగ్రాంజ్ మరణం (జ.1736).
- 1894 : భారతీయ వ్యాపారవేత్త ఘన్ శ్యామ్ దాస్ బిర్లా జననం (మ.1983).
- 1898 : హేతువాది ఎ.టి.కోవూర్ జననం (మ.1978).
- 1932 : భారతీయ హిందుస్తానీ సంగీత విద్వాంసురాలు కిషోరీ అమోంకర్ జననం (మ. 2017).
- 1995 : భారత మాజీ ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయి మరణం (జ.1896). (చిత్రంలో)


క్రిస్టియన్ ఫ్రెడెరిక్ శామ్యూల్ హానిమాన్


జోసెఫ్ లూయిస్ లెగ్రాంజ్

ఘన్ శ్యామ్ దాస్ బిర్లా


ఎ.టి.కోవూర్

కిషోరీ అమోంకర్

మొరార్జీ దేశాయి

రిపబ్లిక్ స్పోర్ట్స్

2028 ఒలింపిక్స్‌లో క్రికెట్: ఆరు జట్లు అమెరికా ఫిక్స్

2028 ఒలింపిక్స్‌లో ఆరు జట్లతో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు.

క్వాలిఫికేషన్ ప్రక్రియను త్వరలోనే ప్రకటించనున్నారు.

విశ్వ క్రీడా సంబరం ఒలింపిక్స్‌లో శతాబ్దకాలం తర్వాత క్రికెట్కు మళ్ళీ చోటు దక్కిన సంగతి తెలిసిందే. దాదాపు 128 ఏళ్ల తర్వాత 2028 లో జరగబోయే లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ భాగం కానుంది. ఈ పోటీల నిర్వహణ కోసం ఇప్పటికే కసరత్తు మొదలైంది. కాగా.. ఇందులో ఆరు జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తాజాగా నిర్ణయించారు. ఆతిథ్య దేశమైన అమెరికాకు డైరెక్ట్ ఎంట్రీ దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పురుషులు, మహిళల విభాగాల్లో అరేసి జట్లతో టీ20 ఫార్మాట్లో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారట. క్వాలిఫికేషన్ ప్రక్రియను ఇంకా నిర్ణయించలేదు. అయితే, ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనున్న అమెరికాకు తప్పకుండా పోటీల్లో స్థానం ఖరారవుతుందని అంచనాలు వెలువడుతున్నాయి. మిగతా ఐదు జట్ల కోసం ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. టెస్టులు, వన్డేల్లా కాకుండా.. టీ20 ఫార్మాట్లో దాదాపు 100 దేశాలు క్రికెట్ ఆడుతున్నాయి. వీటిలో నుంచి తుది జట్లను ఎంపిక చేయడం సవాల్తో కూడుకున్నదే అని నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు. లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ కోసం ఈవెంట్ ప్రోగ్రామ్ను.. అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ ఎగ్జిక్యూటివ్ బోర్డు బుధవారం ఆమోదించింది. ఈ సమావేశంలోనే క్రికెట్లో ఆరు జట్లపై నిర్ణయం తీసుకున్నట్లు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈసారి మొత్తం 351 మెడల్ ఈవెంట్లు నిర్వహించాలని నిర్ణయించారు. 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్తో పాటు బేస్బాల్- సాఫ్ట్బాల్, ఫ్లాగ్ ఫుట్బాల్, లక్రాస్ (సిక్సస్), స్క్వాష్కు కూడా అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే.

1900.. అదే మొదలు.. చివర..

1900 ఒలింపిక్స్‌లలో క్రికెట్ నిర్వహించారు. అదే తొలిసారి, చివరిసారి కూడా. అప్పుడు డెవాన్ అండ్ సోమర్సెట్ వండరర్స్ క్లబ్ (బ్రిటన్), ఫ్రెంచ్ అథ్లెటిక్ క్లబ్ యూనియన్ (ఫ్రాన్స్) మధ్య రెండు రోజుల మ్యాచ్ జరిగింది. అయితే ఈ మ్యాచ్లో ఒక్క జాతీయ ఆటగాడూ లేడు. ఈ మ్యాచ్లో జట్టుకు 12 మంది చొప్పున ఆటగాళ్లు ఆడటంతో దీనికి ఫస్ట్ క్లాస్ హోదా కూడా దక్కలేదు. తొలి ఇన్నింగ్స్‌లో బ్రిటన్ 117 పరుగులు చేయగా.. ఫ్రాన్స్ 78 పరుగులకే ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్ను 145/5 వద్ద బ్రిటన్ డిక్లేర్ చేసింది. ఛేదనలో ఫ్రాన్స్ 26 పరుగులకే కుప్పకూలడంతో బ్రిటన్ 158 పరుగుల తేడాతో నెగ్గింది. అప్పుడు బ్రిటన్ కు రజతం, ఫ్రాన్స్కు కాంస్యం అందించారు. ఆ తర్వాత వీటిని పసిడి, రజత పతకాలుగా మార్చారు. ఆ తర్వాత పలు కారణాలతో క్రికెట్ను ఒలింపిక్స్ పోటీల నుంచి పక్కనబెట్టారు.

అలా చేయకపోయి ఉంటే.. ఇంత దూరం వచ్చేవాడిని కాదు:మంచు మనోజ్

తన కుటుంబంలో జరుగుతోన్న వరుస వివాదాలను ఉద్దేశించి తాజాగా నటుడు మంచు మనోజ్ మాట్లాడారు. సుమారు రెండేళ్ల నుంచి ఈ గొడవలు జరుగుతున్నాయని ఆయన అన్నారు.

తన కుటుంబంలో జరుగుతోన్న వరుస వివాదాలను ఉద్దేశించి తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్ తో మాట్లాడారు నటుడు మనోజ్. ఇది ఆస్తి తగాదా కాదని ఆయన అన్నారు. ఇల్లు, ఇతర ఆస్తులపై తనకు ఏమాత్రం ఇష్టం లేదని మరోసారి స్పష్టంచేశారు. వాళ్లు చేసిన కొన్ని పనుల వల్ల తన మనసు విరిగిపోయిందని చెప్పారు. "విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రశ్నించిన తరుణంలో ఈ గొడవలు మొదలయ్యాయి. సుమారు రెండేళ్ల నుంచి ఈ తగాదాలు జరుగుతున్నాయి. ప్రశ్నించాననే కారణంతో నా గౌరవానికి భంగం కలిగించేలా తప్పుడు కథనాలు వ్యాప్తి చేశారు. నాపై దాదాపు 30 తప్పుడు కేసులు పెట్టారు. కుటుంబం కోసం నేను ఎంతో చేశా. ఆస్తిలో ఒక్క రూపాయి కూడా కోరుకోలేదు. మా నాన్న సినిమాలన్నింటికీ మా అన్నకు సంబంధించిన సంస్థలే పని చేస్తాయి. 'సన్నాఫ్ ఇండియా'లోని ఒక పాట గ్రాఫిక్స్‌కు సుమారు రూ. కోటిన్నర ఖర్చు చేసినట్లు చెప్పారు. దానిని మనం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చేసేయొచ్చు. ఈ గొడవల్లోకి నా భార్యను లాగారు. అలా చేయకపోయి ఉంటే నేను ఇంత దూరం వచ్చేవాడిని కాదు. తన వల్లే చెడిపోతున్నానంటూ స్టేట్మెంట్, ఎఫ్ఐర్లో నా భార్యాబిడ్డల పేర్లు పెట్టడంతో నా మనసు విరిగిపోయింది. నేను తప్పు చేయలేదు. ఆస్తి అడగలేదు. కాబట్టి దేనికీ భయపడను" అని మనోజ్ తెలిపారు. తనపై పగ ప్రతీకారాలు తీర్చుకోవడానికే ఈ దాడులకు పాల్పడుతున్నారని ఆయన వాపోయారు.

స్టార్ హీరో సినిమా.. రిలీజైనట్లు కూడా తెలియదు : గౌతమ్ మేనన్ అసహనం

దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. మలయాళ స్టార్ హీరోతో తాను చేసిన ఒక సినిమా విషయంలో ఒకింత అసహనం వ్యక్తంచేశారు.

మలయాళ అగ్ర నటుల్లో ఒకరైన మమ్ముట్టితో ప్రముఖ దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్ రూపొందించిన చిత్రం 'డొమినిక్ అండ్ ది లేడీస్ పర్స్'. మిస్టరీ కామెడీ థ్రిల్లర్గా తెరకెక్కిన ఈ చిత్రం జనవరి నెలలో విడుదలైంది. తాజాగా ఈ చిత్రాన్ని ఉద్దేశించి గౌతమ్ మేనన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఆ సినిమాకు సంబంధించిన ఒక విషయంలో ఆయన ఒకింత అసహనం వ్యక్తంచేశారు. తమ సినిమా విడుదలైందనే విషయం కూడా చాలామందికి తెలియదన్నారు. అది తనని బాధించిందన్నారు. "విభిన్నమైన కాన్సెప్ట్ 'డొమినిక్ అండ్ ది లేడీస్ పర్స్' రూపొందించాం. చూసిన వాళ్లకు మా సినిమా నచ్చింది. అయితే మా చిత్రాన్ని మేము సరిగ్గా ప్రమోట్ చేయలేదనే భావన నాకు ఉంది. ఎందుకంటే, మా సినిమా విడుదలైన విషయం కూడా చాలామందికి తెలియదు. 'మమ్ముట్టితో సినిమా చేస్తున్నారు కదా అది ఎప్పుడు రిలీజ్ కానుంది? అని ఇప్పటికీ నన్ను అడుగుతున్నవాళ్లు ఉన్నారు. బయట రాష్ట్రాల వారు అడిగితే ఫర్వాలేదు కానీ, కేరళలోని వారికి కూడా మా సినిమా వచ్చిందనే విషయం తెలియకపోవడం గమనార్హం. ఇటీవల నేను కేరళలోని ఓ ప్రాంతానికి వెళ్లా. అక్కడ కొంతమంది 'డొమినిక్ రిలీజ్ ఎప్పుడు అని అడిగారు. వారి మాటలకు నాకెంతో చిరాకు వచ్చింది" అని గౌతమ్ మేనన్ తెలిపారు. అనంతరం ఆయన, మమ్ముట్టితో కలిసి నటించిన 'బజూక' గురించి మాట్లాడారు. ఈ సినిమా కథ చాలా విభిన్నంగా ఉంటుందని.. కథలో ఎన్నో ట్విస్టులు ఉంటాయని చెప్పారు. డీనో డెన్నిస్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీలో తన రోల్ చాలా ప్రత్యేకంగా ఉంటుందని గౌతమ్ మేనన్ వెల్లడించారు. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రిపబ్లిక్ సినిమా

ఓటీటీలోకి 'ఛావా'.. వీరుడి కథ స్ట్రీమింగ్ ఎప్పుడంటే!

థియేటర్లలో సూపర్ హిట్‌గా నిలిచిన 'ఛావా' ఓటీటీలోకి వచ్చేస్తోంది.

నెటిప్లెక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది.

శంభాజీ మహారాజ్ వీరగాథగా విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'ఛావా'. ఇటీవల విడుదలై భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడీ సినిమా డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. నెటిక్స్ వేదికగా ఏప్రిల్ 11 నుంచి అందుబాటులో ఉండనుంది. ఈవిషయాన్ని తెలుపుతూ నెటిక్స్ ఓ పోస్టర్ విడుదల చేసింది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శంభాజీ మహారాజ్ విక్కీ కౌశల్ ఆయన భార్య యేసుబాయి భోంస్లే పాత్రలో రష్మిక జీవించేశారు. ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకుందీ చిత్రం. ఇప్పుడు ఓటీటీలోనూ రికార్డు సృష్టించడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. కథేంటంటే: ఛత్రపతి శివాజీ మరణం తర్వాత మరాఠా సామ్రాజ్యం బలహీనపడిందని, ఇక ఆ ప్రాంతాన్ని దక్కించుకోవడం.. పాలించడం సులభమవుతుందని మొగల్ చక్రవర్తి ఔరంగజేబు (అక్షయ్ ఖన్నా) భావిస్తాడు. అయితే, వారి ఆలోచనలకు ప్రతిబంధకంగా మారతాడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ (విక్కీ కౌశల్). ప్రజల నుంచి దిల్లీ చక్రవర్తులు దోచుకొని దాచిన కోశాగారంపై దాడి చేస్తాడు. ఈ విషయం ఔరంగజేబుకు చేరుతుంది. దక్కన్లో బలం పుంజుకుంటున్న శంభాజీని కట్టడి చేసేందుకు తానే స్వయంగా సైన్యంతో రంగంలోకి దిగుతాడు. శక్తిమంతమైన మొగల్ సేనను శంభాజీ ఎలా ఎదుర్కొన్నాడు? ఈ క్రమంలో అతడికి ఎదురైన పరిస్థితులు ఏంటి? శత్రుసైన్యంతో చేతులు కలిపి స్వామి ద్రోహం చేసిందెవరు? తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

ఆరోగ్యం

కొందరు మామిడి పండును ఎట్టి పరిస్థితుల్లో తినకూడదు, ఎంత దూరంగా ఉంటే అంత మంచిది

మామిడి పండు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. అయితే, కొన్ని ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు మామిడి పండును ఎట్టి పరిస్థితుల్లో కూడా తినకూడదు. మామిడి పండును ఎవరు తినకూడదో ఇక్కడ తెలుసుకుందాం.

వేసవి కాలం ప్రారంభమైంది. ఎండల సంగతి పక్కన పెడితే ఈ సీజన్ చాలా మందికి ఇష్టం. ఎందుకంటే ఈ సీజన్‌లో నోరూరించే మామిడి పండు దొరుకుతుంది. మండే ఎండల్లో మామిడి పండును తినడానికి చాలా మంది ఇష్టపడతారు. నోటికి రుచిగా, తీపిగా ఉండే మామిడి పండును చిన్న, పెద్దా తేడా లేకుండా అందరూ లాగించేస్తారు. అందుకే మామిడి పండును పండ్లలో రారాజు అని పిలుస్తారు. మామిడి పండును కొందరు డైరెక్ట్‌గా తింటే.. మరికొందరు జ్యూసులు, స్మూతీల రూపంలో తీసుకుంటారు. మామిడి పండు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. అయితే, కొన్ని ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు మామిడి పండును ఎట్టి పరిస్థితుల్లో కూడా తినకూడదు. మామిడి పండును ఎవరు తినకూడదో ఇక్కడ తెలుసుకుందాం.

మామిడి పండుతో ఆరోగ్య ప్రయోజనాలు

మామిడిలో ఫైబర్, విటమిన్ ఎ, విటమిన్ సి, మాంగిఫెరిన్ అనే యాంటీఆక్సిడెంట్, పొటాషియంతో పాటు ఇతర పోషకాలు మెండుగా ఉన్నాయి. మామిడి పండు తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇందులో ఉండే విటమిన్ సి కారణంగా రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. మామిడి పండులో ఫైబర్ కడుపు ఆరోగ్యానికి చాలా మంచిది. రెగ్యులర్‌గా మామిడి పండు తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మామిడి పండ్లలో మాంగిఫెరిన్ అనే యాంటీఆక్సిడెంట్ క్యాన్సర్ నిరోధక లక్షణాల్ని కలిగి ఉంటుంది. మామిడి పండ్లు గుండె ఆరోగ్యానికి మేలు చేసే పొటాషియం యొక్క మంచి మూలం. ఇలా చెప్పుకుంటే పోతే మామిడి పండు తినడం వల్ల చాలా మేలు జరుగుతుంది. అయితే, కొందరు మాత్రం వీటికి దూరంగా ఉండాలి. వాళ్లు ఎవరంటే

చర్మ అలెర్జీలు

మామిడి పండులో ఉరుషియోల్ అనే రసాయనం ఉంటుంది. మామిడి తినడం వల్ల ఈ రసాయనానికి సున్నితంగా ఉండే వ్యక్తులలో చర్మ అలెర్జీలు వస్తాయి. ముఖ్యంగా చర్మం మంటగా మారి పొరలుగా, దురద, బొబ్బలు వంటి సమస్యలు వస్తాయి. అందుకే ఇప్పటికే చర్మ అలెర్జీ సమస్యలతో బాధపడేవారు మామిడి పండుకు దూరంగా ఉండాలి. ఇలాంటి వారు మామిడి పండు తినడం వల్ల జ్వరం లేదా దద్దుర్లు కూడా వచ్చే అవకాశం ఉంది. అందుకే చర్మ సంబంధిత సమస్యలతో బాధపడేవారు మామిడి పండుకి దూరంగా ఉండటమే మేలు అంటున్నారు నిపుణులు.

ఊబకాయం బాధితులు



మామిడి తినడానికి ఎంత రుచికరంగా ఉన్నా, అది ఊబకాయాన్ని పెంచుతుంది. నిజానికి, మామిడి పండులో చాలా ఎక్కువ కేలరీలు ఉంటాయి. సగటు పరిమాణంలో ఉన్న మామిడిలో 150 కేలరీలు ఉంటాయి. అందుకే మామిడి పండు ఎక్కువగా తినడం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉంది. అందుకే ఇప్పటికే బరువు తగ్గాలనుకునేవారు మామిడి పండ్లు ఎక్కువ మోతాదులో తినడం మానుకోవాలి. ఇప్పటికే ఊబకాయంతో బాధపడుతున్నవారు మామిడిని తక్కువ మోతాదులో తినాలి. చిన్న సైజులో ఉన్న మామిడి తింటే సరిపోతుంది.

జీర్ణ సమస్యలు

ఈ రోజుల్లో చాలా మంది గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటి వారు మామిడి పండును ఎక్కువ తినడం హానికరం. మామిడి తినడం వల్ల జీర్ణక్రియ పాడయ్యే అవకాశం ఉంది. ఇలాంటి వారు మామిడి పండుకు దూరంగా ఉండాలి. కడుపు సమస్యలు ఉన్నవారు లేదా పేగు ఆరోగ్యం బలహీనంగా ఉన్నవారు మామిడి తినకుండా ఉండాలి. లేకపోతే అది అజీర్ణం, అజీర్తి, వాంతులు, వికారం, మలబద్ధకానికి కారణమవుతుంది. ఇది కాకుండా, కొన్నిసార్లు మామిడి పండ్లను ఎక్కువగా తినడం వల్ల కడుపు ఇన్ఫెక్షన్ కూడా రావచ్చు.

డయాబెటిస్ రోగులు

మధుమేహ వ్యాధిగ్రస్తులు మామిడి తినకుండా ఉండాలి. ఎందుకంటే మామిడి పండు అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర పెరుగుదలకు కారణమవుతుంది. దీంతో పాటు మామిడి పండులో అధిక మొత్తంలో సహజ చక్కెర ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని వేగంగా పెంచుతుంది. కాబట్టి, డయాబెటిస్ ఉన్న రోగులు మామిడి పండు తినకుండా ఉండాలి. లేకపోతే, ఇది వారి రక్తంలో చక్కెర స్థాయిని పెంచడం ద్వారా మధుమేహం అసమతుల్యతకు కారణమవుతుంది. ఒకవేళ మీకు తినాలనిపిస్తే వైద్యుణ్ని సంప్రదించి తగిన సలహా తీసుకోవడం చాలా ముఖ్యం.

లేటెక్స్ అలెర్జీ ఉన్న వ్యక్తులు



మీకు లేటెక్స్ అలెర్జీ ఉంటే జాగ్రత్తగా ఉండండి. మామిడి పండ్లలో లభించే ప్రోటీన్లు లేటెక్స్‌లో ఉండే ప్రోటీన్‌లను పోలి ఉంటాయి. దీంతో మామిడి పండు లేటెక్స్ అలెర్జీ బాధపడేవారికి ముప్పు. ఇలాంటి వారి శరీరం లేటెక్స్ అలెర్జీ కారకంగా స్పందించవచ్చు. దీంతో శరీరంలోని వివిధ భాగాలలో నీటి దద్దుర్లు కనిపించవచ్చు. అందుకే లేటెక్స్ అలెర్జీతో బాధపడేవారు మామిడి పండుకు దూరంగా ఉండాలి.

గమనిక:ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.